ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
1

విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 15 జూన్ 2025

ముగిసిన ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ

విజయనగరం కలెక్టరేట్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ శనివారం ముగిసింది. క్లస్టర్ వేకెన్సీ అవకాశం కల్పించడంతో తప్పకుండా బదిలీలు కావల్సిన 152 మంది ఉపాధ్యాయులకు శనివారం రాత్రి డీఈవో మాణిక్యంనాయుడు సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టారు. క్లస్టర్ వేకెన్సీని చివరిలో చూపించడంతో, సీనియార్టీ జాబితాలో ముందు ఉన్నవారు కొండపై ఉన్న పాఠశాలలకు ఆప్షన్ ఎంచుకోవాల్సి వచ్చిందని కొందరు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

నాన్న ఎప్పటికీ హీరోనే!



- ఆయనే మొదటి గురువు, స్నేహితుడు
- నేడు ప్రపంచ ఫాదర్స్ డే

నాన్నంటే కొండంత అండ.. ఎంతటి కష్టంలోనైనా నేనున్నానంటూ నిలిచే ధైర్యం. భవిష్యత్‌కు భరోసా.. అడుగడుగునా మన వెంట ఉంటూ చేయూతనిచ్చే మార్గదర్శి. పిల్లల ఉన్నతి కోసం పరితపించే నిరంతర శ్రమజీవి. ఆయన త్యాగం, సహనం వెలకట్టలేనిది. అందుకే పితృదేవోభవ అంటారు. జీవితంలో ఎవరికైనా నాన్నే రియల్ హీరో. మన మొదటి గురువు, తొలి స్నేహితుడు కూడా నాన్నే. నాన్న రెండు అక్షరాలే అయినా.. నిస్వార్థమైన ప్రేమకు, ఆత్మీయతకు అది ప్రతిరూపం. నాన్న కోపంగా ఉన్నా.. కఠినంగా ఉన్నా.. ఒక దెబ్బకొట్టి శిక్షించినా.. తండ్రి గుండెల నిండా ఉంటారు పిల్లలు. ఆయన ఆలోచన అంతా పిల్లల భవిష్యత్ కోసమే పరితపిస్తుంటుంది. ఎదిగే బిడ్డలను చూసి ఆనందంగా పొంగిపోతాడు. పది మందికి చెబుతూ మురిసిపోతాడు. బిడ్డల విజయాన్ని తన విజయంగా చెబుతుంటాడు. అందుకే నాన్న ఎప్పటికీ మన హీరోనే.

ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

విజయనగరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మనల్ని ప్రపంచానికి పరిచయం చేసింది అమ్మ అయితే.. మనకు ప్రపంచాన్ని పరిచయం చేసేది మాత్రం తండ్రి. తల్లి మాటలతో ధైర్యం చెబితే.. తండ్రి చేతలతో మనలో ధైర్యం నింపుతాడు. మనల్ని తీర్చి దిద్ది.. మన భవిష్యత్‌కు (మిగతా 4వ పేజీలో)

తండ్రి దిశానిర్దేశంతోనే ఈ స్థాయికి..

- ఎస్పీ వకుల్ జిందాల్



తల్లిదండ్రులు, భార్య, బాబుతో ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): 'జిల్లా ఎస్పీగా నేను ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం నా తల్లిదండ్రులే'నని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రపంచ ఫాదర్స్ డే పురస్కరించుకుని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'నా తండ్రి దిశానిర్దేశంతోనే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. చిన్నప్పటి నుంచి నాకు చదువు పట్ల ఎంతో ఆసక్తి కలిగే విధంగా ప్రోత్సహించేవారు. నాపై ఎంతో శ్రద్ధ చూపేవారు. విద్యాభ్యాసం ప్రారంభం నుంచి ఉన్నత చదువుల వరకూ ఆయన పర్యవేక్షణ వెలకట్టలేనిది. తండ్రి ప్రోత్సాహంతో చదివే ప్రతి దాంట్లో ఉన్నత స్థానంలో నిలిచాను. చివరకు సివిల్స్‌లో కూడా టాపర్ ర్యాంకర్‌గా నిలిచానంటే దాని వెనుక తల్లిదండ్రుల సపోర్టు ఎంతో ఉంది. ఐపీ ఎస్‌ని ఎంపిక చేసుకుని ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాను. నా తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఉద్యోగ బాధ్యతలు నెరవేర్చుతాను.' అని ఎస్పీ తెలిపారు.

తండ్రి రుణం తీర్చుకోలేనిది..

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



విజయనగరం దాసన్నపేట, జూన్ 14: 'మాది అతి బీద సామాన్య రైతు కుటుంబం. నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు ముఖ్య కారకుడు మా నాన్నే. ఆయన కష్టార్జితంపై మమ్మల్ని పెంచి పెద్దచేసి ఉన్నత స్థాయికి చేర్చారు. మా తండ్రి రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనిది. నేను డిగ్రీ చదువుతున్నప్పుడు ఓ రూమ్‌లో ఉండేవాడిని. ప్రతిరోజూ వంట చేసుకుని కాలేజీకి వెళ్లేవాడిని. ఇది సరికాదని భోజనం కోసం మంచి హోటల్‌లో టోకెన్లు తీసుకుని ఇచ్చారు. ఎంత ఆర్థిక ఇబ్బందులకు లోనైనా నా చదువుకు ఇబ్బంది కలగకుండా చేశారు. దీంతో నేడు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ప్రజలకు సేవలు అందిస్తున్నాను.' అని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

నీట్‌లో మెరిశారు

- జిల్లా విద్యార్థులకు మంచి ర్యాంకులు



మద్రాపు జయదీప్

బొబ్బిలి,జూన్14(ఆంధ్రజ్యోతి):దేశ వ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. బొబ్బిలి పట్టణంలోని మెహెర్‌కాలనీకి చెందిన మద్రాపు జయదీప్ ఆలిండియా స్థాయిలో 672 ర్యాంకు సాధించాడు. విజయవాడ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన జయదీప్ నీట్‌లో 613 మార్కులతో 672ర్యాంకును సాధించాడు. ఓబీసీ కేటగిరిలో 183ర్యాంకు వచ్చింది. జయదీప్ తండ్రి రామకృష్ణ ఇటీవల అజ్జాడ జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు. తల్లి శోభారాణి తామర ఖండిలో ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఎంబీబీఎస్ తరువాత పీజీలో ఏదైనా స్పెషలైజేషన్ చేసి మంచి వైద్యునిగా గుర్తింపు పొందాలన్నది తన ఆశయమని జయదీప్ తెలిపారు.

989 ర్యాంకు పొందిన సహజ



జాగరపు సహజ

జామి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జన్నివలస గ్రామానికి చెందిన జాగరపు సహజ ఆలిండియా స్థాయిలో 989 ర్యాంకు సాధించింది. ఓబీసీ విభాగంలో 294 ర్యాంకు పొందింది. సహజ తండ్రి ఈశ్వరరావు మండలంలోని యాతపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. తల్లి రాధ ఎస్.కోట మండలం ముషిడిపల్లిలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కుమార్తె ప్రతిభపై హర్షంవ్యక్తం చేస్తున్నారు.

1791 ర్యాంకు సాధించిన తారాచంద్ర



పల్లి తారాచంద్ర

రాజాం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ పరీక్ష ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. రాజాం పట్టణానికి చెందిన పల్లి తారాచంద్ర ఆలిండియా స్థాయిలో ఓపెన్ కేటగిరిలో 1791 ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 584 ర్యాంకు సాధించాడు. తారాచం ద్ర 10వ తరగతి (సీబీఎస్ఈ) వరకు స్థానిక డీపీవీ స్కూల్‌లో, ఇం టర్మీడియట్ (సీబీఎస్ఈ) విశాఖపట్నం శ్రీచైతన్య కళాశాలలో చదివా డు. పదోతరగతిలో 467 మార్కులు, ఇంటర్‌లో 479 మార్కులు సాధించాడు. తారాచంద్ర తండ్రి జనార్దన భోగాపురం ఎయిర్ పోర్ట్‌లో పనిచేస్తున్నారు. తల్లి రాజకుమారి గృహిణి. డాక్టర్ కావాలనే లక్ష్యంతో పట్టుదలగా చదివినట్లు తారాచంద్ర తెలిపాడు

ప్రవల్లికకు 6,788 ర్యాంకు..



మిత్తిరెడ్డి ప్రవల్లిక

మెరకముడిదాం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): చిన్న బంటుపల్లి గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి ప్రవల్లిక ఆలిండియా స్థాయిలో 6,788 ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 2,742 ర్యాంకు సాధించింది. ఇటీవల ఎంసెట్ ఫలితాల్లో 194ర్యాంకు పొందింది. ఇంటర్ సీబీఎస్ఈలో 500 మార్కులకు 476 సాధించింది. తన కుమార్తె మొదటి ప్రయ త్నంలోనే నీట్‌లో మంచి ర్యాంకు సాధించిందని, ప్రవల్లిక తల్లిదండ్రులు గౌరినాయుడు, సుమలత ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల చదువుకు భరోసా

- 'తల్లికి వందనం' నిధులు విడుదలపై మహిళల హర్షం
- చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

చీపురుపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిడి వీధికి చెందిన విద్యార్థుల తల్లులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి శనివారం పాలభిషేకం చేశారు. తల్లికి వందనం పథకంలో భాగంగా తమ ఖాతాల్లోకి నగదు జమ కావడంతో చంద్రబాబుకు వారు ధన్యవాదాలు తెలిపారు. పేద కుటుంబాల్లోని పిల్లల చదువుకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గవిడి భారతి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గవిడి నాగరాజు, ఎస్.కనకరాజు, శ్రీనివాసరావు, రాము నాయుడు, కోలా రాము, గవిడి సాయి, చిలూకూరు శేఖర్, గవిడి జయ, రూపవతి తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి గవిడి వీధిలో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న మహిళలు

నేటి నుంచి దర్తీ అబా అభియాన్ శిబిరాలు

- కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నుంచి ఈ నెల 30 వరకు దర్తి అబా అభియాన్ పేరుతో శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజనులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు వారికి లబ్ధి చేకూర్చడానికి శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రేషన్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, పీఎం కిసాన్, జనధన్ ఖాతా, గ్యాస్ కనెక్షన్లు, బీమా కవరేజ్, సామాజిక భద్రతా పింఛన్లు, ఉద్యోగ జీవనోపాధి పథకాలు, పీఎం విశ్వకర్మ, ముద్ర రుణాలు, మహిళా శిశు సంక్షేమ, ఆరోగ్య ప్రయోజనాలు, టీకాలు తదితర సేవలు అందిస్తామని వివరించారు.

17న అండర్-16 క్రికెట్ జట్టు ఎంపికలు



విజయనగరం రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న అండర్-16 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం శివారు విజ్జీ క్రికెట్ మైదానంలో ఈ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2009 సెప్టెంబరు 1 తరువాత జన్మించిన వారు అర్హులని అన్నారు. ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధృవీకరణ పత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్‌తో మంగళవారం ఉదయం 7.30 గంటలకు విజ్జీ స్టేడియానికి హాజరుకావాలని కోరారు. క్రీడాకారులు వైట్ డ్రెస్‌తో పాటు, క్రికెట్ కిట్టుతో రావాలని కోరారు.

కులగణనలో తీవ్ర అన్యాయం

- విశ్వబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతురావు

బొబ్బిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణుల జనాభా 25 లక్షలకు పైబడి ఉండగా వైసీపీ హయాంలో ఆ జనసంఖ్యను 4 లక్షలకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో 7 లక్షలకు తేల్చారని, ఇది చాలా అన్యాయమని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతురావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక గాంధీబొమ్మ సెంటరులో గల సంఘ భవనంలో జిల్లా సంఘం అధ్యక్షుడు ముగడ వెంకటరమణ, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు ములగపాటి బంగార్రాజుల ఆధ్వర్యంలో సంఘ ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హనుమంతురావు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విశ్వబ్రాహ్మణుల జనాభాను 19.5 లక్షలున్నట్లు ప్రకటించగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో ఆ సంఖ్యను ఏడు లక్షలుగా చూపుతున్నారన్నారు. పక్కా లెక్కలను ఆధారాలతో సహా ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

హామీలు విస్మరించారు..

జీవో నెం.272ని సవరిస్తామని చెప్పిన మాటను విస్మరించారని హనుమంతురావు అన్నారు. స్వర్ణకారుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి దానిని ఎంఎస్‌ఎంఈకి అనుసంధానం చేయడం, అప్రైజర్ వ్యవస్థను పూర్తిగా తమ కులానికి వర్తింపజేయడం, మంగళసూత్రాల తయారీ పేటెంట్‌ను విశ్వబ్రాహ్మణులకు ఇవ్వడం, టింబర్ డిపోలను మంజూరు చేయడం, అటవీశాఖ వేధింపుల నుంచి రక్షణ కల్పించడం వంటి వాటిని విస్మరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పంచ వృత్తులు చేసుకునే విశ్వబ్రాహ్మణులందరికీ వేర్వేరుగా కులాలుగా పరిగణించకుండా అందరినీ ఒకే విశ్వబ్రాహ్మణులుగా అధికారికంగా గుర్తించేలా జీవో జారీ చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శోభన్‌బాబు, సర్వసిద్ధి త్రినాథ రావు, అండ్లూరి గణేశ్, నారాయణ, హరిబాబు, కృష్ణ, కర్రి సత్యనారాయణ, జగదీశ్, త్రినాథ, రామారావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విశ్వబ్రాహ్మణులు

చినుకు పడితే పవర్ కట్!

- జిల్లాలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం
- ఈఎల్ఆర్ లేదంటున్న అధికారులు
- క్షేత్రస్థాయిలో మాత్రం ఎప్పటికప్పుడు నిలిపివేత
- తరచూ సాంకేతిక సమస్యలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు





రాజాం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనధికార విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. రాత్రీ పగలూ అన్న తేడా లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అధికారులు మాత్రం విద్యుత్ కోతలు లేవని చెబుతున్నారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. చిన్నపాటి వర్షం పడినా.. ఈదురుగాలులు వీచినా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తు న్నారు. మారుమూల గ్రామాలకు అయితే గంటల తరబడి విద్యుత్ కోత విధిస్తున్నారు. దీంతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం.

తీగలు భయపెడుతున్నాయి..

ప్రస్తుతం పొలాలతో పాటు రోడ్ల వెంబడి ఉన్న హైటెన్షన్ తీగలు భయపెడుతున్నాయి. చాలావరకూ స్తంభాలకు సపోర్టింగ్ వైర్లు లేక ఒక వైపువేలాడుతున్నాయి. ప్రస్తుతం ఈదురుగాలులు వీస్తుండడంతో ఎప్పుడు కూలిపోతాయో తెలియని స్థితిలోకి మారాయి. వాస్తవానికి హైటెన్షన్ విద్యుత్ లైన్లకు సంబంధించి స్తంభాల మధ్య 50 మీటర్ల నిడివి ఉండాలి. కానీ, ఈ నిబంధన పాటించలేదు. ప్రతీ స్తంభం 4 అడుగుల లోతులో పాతాలి. సమపాళ్లలో కాంక్రీట్ వేసి బలోపేతం చేయాలి. కానీ అప్పట్లో కాంక్రీట్ వేయలేదు. స్తంభం విడిచి స్తంభానికి సపోర్టింగ్ వైరు వేయాలి. అలాగే ఫీజు బాక్సు, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసిన స్తంభానికి సపోర్టుగా మరో స్తంభాన్ని అడ్డంగా ఏర్పాటుచేయాలి. కానీ ఇవేవీ చేయలేదు. దీంతో ఎక్కడిక క్కడే స్తంభాలు గాల్లో వేలాడుతున్నాయి. ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో రహదారులపై ప్రయాణించే వారు, వాహన చోదకులు భయపడిపోతున్నారు.

ఇదీ పరిస్థితి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 ఏజెన్సీ మండలాలు ఉన్నాయి. కేటగిరీ-1 విద్యుత్ కనెక్షన్లు 6,71,921, కేటగిరీ-2కు సంబంధించి 68,398, కేటగిరీ-3కి సంబంధించి 2,754 కనెక్షన్లతో (మిగతా 4వ పేజీలో)

సమస్యలు పరిష్కరిస్తున్నాం

జిల్లాలో విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తున్నాం. సిబ్బంది కొరత మాట వాస్తవమే. అయినా ఉన్న సిబ్బందితో పనిచేయిస్తున్నాం. ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. వర్షాకాలం కావడంతో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అటు గ్రామాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు సైతం మంచి సేవలు అందిస్తున్నారు.

-లక్ష్మణరావు, ఎస్ఈ, విద్యుత్ శాఖ, విజయనగరం

- గత నెల 21న ఉమ్మడి జిల్లాలోని సాలూరు అల్లువీధి రామమందిరంలో విద్యుత్ ఏడీఈ రంగారావును స్థానికులు నిర్బంధించారు. అల్లువీధితో పాటు అక్కేన వీధి, నాయుడు వీధి, దుగ్గాణ వీధులకు మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఆగ్రహానికి గురయ్యారు. పెద్ద సంఖ్యలో జాతీయ రహదారిపైకి వచ్చి కొవ్వొత్తులతో ధర్నా నిర్వహించారు. చిన్నపాటి వర్షం పడినా.. ఈదురుగాలులు వీచినా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలన కోసం అక్కడకు వెళ్లిన ఏడీఈని స్థానికులు నిర్బంధించారు.

బిజినెస్ ప్లస్

శ్రీకాకుళం ● ఆదివారం 15 జూన్ 2025

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఓఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲

నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.



లవ్ యూ నాన్న



ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్ల పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెల్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్‌లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.

వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!

ఈ నిబంధనలు తెలుసుకోండి..



ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆధారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యకికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి ఆయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్‌టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్‌టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్‌టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్‌టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జూలైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వార్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసీకి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్

ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్

వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం



మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్స్-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జిఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కోజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃప్రవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.


ప్రణతికి కాంస్యం

ఆసియా జిమ్నాస్టిక్స్



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, థీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ట సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ ఆరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టెన్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హాప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హాప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తి యుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్‌క్రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.



ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 282/5 (మార్‌క్రమ్ 136, బవుమా 66; బెడింగమ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్‌క్రమ్** నిలిచాడు.

తొలి సెషన్‌లోనే..: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్‌క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్‌క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టాస్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.

సరికొత్త అధ్యాయం



ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.

దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిలీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిరస్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్‌క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.

ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్ క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అక్రమాలను అడ్డుకోలేరా?

● మండలంలో నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు ● చోద్యం చూస్తున్న అధికారులు

జామి, జూన్14 (ఆంధ్రజ్యోతి): జామి మండలంలో అడ్డగోలు కార్యకలాపాలు యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. అధికారులు కనీస చర్యలు చేపట్టపోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే..



చెత్త సంపద కేంద్రం కూల్చివేతను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



పశువుల సంత వద్ద మూగజీవాలకు హింస



అనధికారికంగా ఏర్పాటైన వాటర్ ప్లాంట్

అనుమతులు లేకుండా సంత..

మండలంలోని లోట్లపల్లి పశువుల సంత నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవు. ఏడాదికి పైబడి ఇక్కడ అనధికారికంగానే సంతను నిర్వహిస్తున్నారు. ఇక్కడ వారానికి సుమారు రూ.2 నుంచి 5 కోట్ల వరకూ పశువుల వ్యాపారం జరుగుతుంది. కొన్నేళ్లుగా ఇక్కడ సంత నిర్వహిస్తున్నారు. దీనికి ప్రత్యేకంగా కమిటీ కూడా ఉంది. అయితే ఏటా సంతను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. అయితే.. గడిచిన 15 నెలలుగా సంతను రెన్యువల్ చేయకుండానే అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఈ సంతకు అనుమతులు ఇస్తే తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందని ఈ కమిటీలో అధికారులు సమావేశానికి హాజరు కావడం లేదు. దాంతో ప్రతీసారి సమావేశం వాయిదా పడుతోంది. అనుమతులు లేకుండా సంత నిర్వహించడం చట్ట విరుద్ధం అని తెలిసినా దాన్ని అడ్డుకునేందుకు మండల పరిషత్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. పైగా సంత నిర్వాహకుడు తనకు అందరి అండదండలు ఉన్నాయని బహిరంగంగా చెబుతుండటం విశేషం. ప్రతి సోమవారం నిర్వహించే సంత జీవ హింస అధికంగా ఉంటున్నా అటుగా కన్నెత్తి చూడని అధికారుల తీరు పలు విమర్శలకు తావిస్తోంది.

చెత్త సంపద కేంద్రం కూల్చినా..

గత ఏడాది నవంబర్‌లో మండలంలోని రామయ్యపాలెంలోని చెత్తసంపద కేంద్రాన్ని కొందరు వ్యక్తులు కూల్చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని సదరు సర్పంచ్.. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ చుట్టూ తిరుగుతున్న కూల్చిన వారిపై చర్యలు లేవు. తూతూ మంత్రంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు డీపీవో దృష్టిలో పెట్టి వదిలేశారు.

అక్రమంగా వాటర్ ప్లాంట్..

మండలంలోని జాగరంలో దాదాపు రూ.పది కోట్ల వ్యయంతో అతిపెద్ద వాటర్ ప్లాంట్ నిర్మించారు. పంచాయతీ తీర్మానం లేకుండానే వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. ప్లాంట్ నుంచి పన్ను రూపంలో పంచాయతీకి రూ.లక్షల ఆదాయం రావాల్సి ఉన్నా మండల అధికారులు అటుగా కన్నెత్తి చూడటంలేదు. నాలుగు నెలల క్రితం నోటీసులు ఇచ్చాం.. త్వరలో పంచాయతీ పన్ను వసూళ్లు చేస్తామని ప్రకటనలు తప్ప వారి నుంచి పన్ను రాబెట్టే ధైర్యం చేయలేక పోతున్నారు.

విచారణ చేస్తున్నాం..

మండలంలో అనధికారికంగా సంత నిర్వహణ, చెత్త సేకరణ కేంద్రం ధ్వంసం, అనధికారికంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటుపై దృష్టిపెట్టాం. త్వరలోనే చర్యలు చేపడతాం. **-ఉమ, ఈవోపీఆర్డీ, ఎస్.కోట**

76 స్పౌజ్ కోటా పెన్షన్ల మంజూరు

విజయనగరం రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండల పరిధిలోని 13 పంచాయితీల పరిధిలో 76 స్పౌజ్ కోటా కింద పెన్షన్లు మంజూరు అయ్యాయని ఎంపీడీవో గంటా వెంకటరావు ఓ ప్రకటనలో తెలిపారు. బియ్యాలపేటకు 3, చెల్లూరుకు 6, దుప్పాడకు 10, ద్వారపూడికి 9, గొల్లలపేటకు 5, గుంకలాంకు 7, జొన్నవలసకు 2, కొండకరకాంకు 7, కోరుకొండకు 7, మలిచర్లకు 8, నారాయణపురానికి 5, రాకోడుకు 4, సారికకు 3 చొప్పున మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే వీరికి పెన్షన్ మొత్తాన్ని అందజేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

రహదారులకు మహర్దశ

రాజాం, జూన్14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవతో రహదారులకు మహర్దశ పట్టిందని పార్లమెంటరీ నియోజకవర్గం బీసీ సెల్ కార్యదర్శి పిల్లా సత్యంనాయుడు అన్నారు. శనివారం రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమారు రూ.100 కోట్లతో గ్రామీణ రహదారులు, రూ.20 కోట్లతో రాజాం పట్టణంలో ప్రధాన రహదారి పనులు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.800 కోట్లతో ఎమ్మెల్యే డీపీఆర్ సిద్ధం చేశారన్నారు. అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు నెరవేరుస్తున్నారన్నారు.

మదుములు బాగుచేయించండి



పిచ్చిమొక్కలతో నిండిన సారధిగెడ్డ

రాజాం రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): వందలాది ఎకరాలకు సాగునీరు అందించే సారధిగెడ్డ ముదుములను సత్వరమే బాగు చేయించాలని టీడీపీ సీనియర్ నాయకుడు, సారధి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ టంకాల వెంకటేశం నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. శనివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని రంగప్ప చెరువు కాల్వలు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయని ఫలితంగా ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదన్నారు. సారధి గ్రామ పరిధిలోని సుమారు వెయ్యి ఎకరాల భూములకు రంగప్ప చెరువు నీరే ప్రధాన సాగునీటి వనరు అన్నారు. కాల్వలు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోవడం, మదుములకు తలుపులు లేకపోవడంతో నీటి సరఫరా శివారు భూములకు అందడం లేదన్నారు. ఈనేపథ్యంలో నీటిపారుదలశాఖ అధికారులు స్పందించిన చర్యలు చేపట్టాలని కోరారు.

పొరపాట్లు చేయవద్దు

● డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి

రాజాం, జూన్14 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల ప్రతినిధులు ఆర్థిక పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి ఆదేశించారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి, తెర్లాం మండలాల గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలకు అంతర్గత ఆడిట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ ఎ.చిరంజీవి. ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

కొత్తవలసలో వర్సిటీని ఏర్పాటు చేయాలి

కొత్తవలస, జూన్14 (ఆంధ్రజ్యోతి): గిరిజన వర్సిటీని కొత్తవలస మండలంలోనే ఏర్పాటు చేయాలని నియోజకవర్గ జనసేన నాయకుడు కె.సత్యనారాయణరాజు డిమాండ్ చేశారు. శనివారం కొత్తవలసలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని రెల్లి గ్రామంలో గిరిజన వర్సిటీ ఏర్పాటుకు 2015లో భూసేకరణ జరిగిందన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వేరేచోటకు మార్పు చేసిందన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గిరిజన వర్సిటీని కొత్తవలసలో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారన్నారు. మంత్రి లోకేశ్ అసెంబ్లీలో గిరిజన వర్సిటీని కొత్తవలసలో ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. ఇప్పుడు వర్సిటీకి బదులు గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించడంపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ నేపథ్యం లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు వినతిపత్రాలను పంపించామన్నారు.

కార్మికుల పిల్లలకు 'తల్లికి వందనం' ఇవ్వండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

రాజాం రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 48 వేల మంది మున్సిపల్ ఇంజినీరింగ్, ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం నిధులు జమ కాలేదన్నారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వర్తింపజేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ధర్నాలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

యోగాతో మానసికోల్లాసం



యోగాసనాలు వేయిస్తున్న ఎంపీడీవో

రాజాం, జూన్14 (ఆంధ్రజ్యోతి): యోగా మానసికోల్లాసానికి దోహదపడుతుందని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 148 ప్రాంతాల్లో శనివారం యోగాంధ్రను నిర్వహించారు. సుమారు 9545 మంది పాల్గొన్నారు. రాజాంలో ఈ నెల 21న 23,698 మందితో యోగాంధ్ర నిర్వహణకు రిజిస్ట్రేషన్ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు ప్రహరీ నిర్మించండి

శృంగవరపుకోట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట డంపింగ్ యార్డుకు ప్రహరీ నిర్మించాలని రైతులు కోరారు. డంపింగ్ యార్డుకు వెళ్లేదారి అధ్వానంగా ఉందన్నారు. నడిచేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోందని వారంటున్నారు. డంపింగ్ యార్డుకు అనుకుని ఉన్న పొలాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా రోడ్డును బాగుచేయాల్సి ఉందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డునకు ప్రహరీ నిర్మించాల్సి ఉంది.

సాంబశివరాజు కుటుంబానికి పరామర్శ



చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న దృశ్యం

గుర్ల, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కె.సాంబశివరాజు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను శనివారం బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో సేవలు చేసిన సాంబశివరాజు లేనిలోటు పార్టీకి తీరనిదన్నారు. అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుండానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. బంగార్రాజు మాట్లాడుతూ పారీ కోసం గ్రామస్థాయిలో పనిచేయడం చాలా కష్టతరమన్నారు. అలాంటి వ్యక్తుల్లో సాంబశివరాజు ఒకరని కొనియాడారు. జిల్లా స్థాయిలో మహిళా విభాగంలో విమలారాణి సేవలను కొనియాడారు. తగిన గుర్తింపు ఆయన కుటుంబానికి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.గోవింద్ ఉన్నారు.

లాకౌట్ ఎత్తివేతకు చర్యలు

● కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు నెక్కల

కొత్తవలస, జూన్14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్‌నగర్‌లో జేఎస్ఎల్ కర్మాగారం లాకౌట్ ఎత్తివేతకు చర్యలు చేపడుతున్నట్టు కర్మాగార కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు తెలిపారు. శనివారం కొత్తవలసలో ఆయన విలేకరులతో మాట్లాడారు. యాజమాన్యం కర్మాగారం తెరవడానికి సిద్ధంగా లేదన్నారు. అయినప్పటికీ కర్మాగారాన్ని తెరిపించాలని ప్రయత్నిస్తున్నామన్నారు. యాజమాన్యం కూడా చర్చలు జరపడానికి సుముఖంగానే ఉందన్నారు. త్వరలో యాజమాన్యంతో మాట్లాడి కార్మిక సంఘం నాయకులు, కార్మికులు, యాజమాన్యంతో చర్చలు జరిపి సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. కార్మికులకు సంపూర్ణ న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నానని అన్నారు..

రక్తదానం చేసిన యువత



రక్తదానం చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువత

శృంగవరపుకోట రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని మండలంలోని శివరామరాజుపేట యువత కోరారు. శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా కొట్యాడ జగదీశ్, ఉప సర్పంచ్ ప్రసాద్, రిటైర్డ్ ఆర్మీ జవాన్ సుధాకర్, అంజి ఆధ్వర్యంలో విశాఖకు చెందిన కేజీహెచ్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 33 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారిని స్థానిక పెద్దలు అభినందించారు. ఈ సందర్భంగా రక్తదానం విశిష్టత తెలిపే ప్లకార్డులను ప్రదర్శించారు. గ్రామస్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారు.

రక్తదాతలకు సత్కారం



రక్తదాతలను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రాజాం, జూన్14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్యాస్ ఏజెన్సీలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. రక్తం గ్రూప్‌లను కనుగొన్న కార్ల్ ల్యాండ్ స్టినర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎక్కువ సార్లు రక్తదానం చేసిన మండల చైతన్యకుమార్, వావిలపల్లి చంద్రశేఖర్, కె.జనార్దన్, బూరాడ శివకృష్ణలను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మానవత సెక్రటరీ ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్. జూనియర్ రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ అదపాక దామోదరరావు పాల్గొన్నారు.

ముగ్గురు కార్యదర్శుల నియామకం

విజయనగరం రూరల్, జూన్14 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని మూడు పంచా యతీలకు కార్యదర్శుల నియామకం జరిగిందని ఎంపీడీవో గంటా వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. కోరుకొండపాలెం, బియ్యాలపేట, చిల్ల పేటల్లో ఈ ముగ్గురు బాధ్యతలు స్వీకరించను న్నారన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా కార్యదర్శుల బదిలీ జరిగింది.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

బొండపల్లి, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుడుబిల్లి- గజపతినగరం రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి శనివారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో మృతి చెందినట్టు బొబ్బిలి రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఎర్రరంగు షర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి జేబులో కేసింగ నుంచి చెన్నై సెంట్రల్‌కు రైలు టిక్కెట్ ఉన్నట్టు గుర్తించామన్నారు. మృతదేహాన్ని విజయనగరంలోని మహారాజా సర్వజన ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9491813163, 9490617089లకు సంప్రదించాలని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ..

రాజాం రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాం-జి.సి.పల్లి జంక్షన్ మధ్యలో శనివారం గుర్తుతెలియని వాహనం ఢీకొని బొబ్బిలి మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన తిమనాన కాంతమ్మ (55) మృతి చెందినట్టు రాజాం ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. 25 ఏళ్లుగా మానసిక వైకల్యంతో బాధపడుతున్న ఆమె తరచూ ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళుతుండేదన్నారు. ఇవాళ రోడ్డుపక్కనే పడి ఉన్న ఆమెను చూసిన కొందరు సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశారన్నారు. మృతురాలు తన మేనత్త అని వజ్జి వంశీకృష్ణ గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారన్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్టు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుకు వ్యక్తి..

వీరఘట్టం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఖండాపు శ్రీనివాసరావు(47) శనివారం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. శ్రీనివాసరావు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వస్తున్నప్పుడు కొంచ గ్రామ సమీపంలో పిడుగు పాటుకు గురయ్యాడు. ఈ ఘటనపై ఎస్ఐ జి.కళాధర్ కేసు నమోదు చేశారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

రామభద్రపురం, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ వద్ద శనివారం సాయంత్రం ఎస్ఐ వెలమల ప్రసాద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు యువకులు పోలీసులను చూసి వాహనం విడిచిపెట్టి పారిపోయారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా డిక్కీలో 20 కిలోల గంజాయి ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. యువకులను వెంటాడినప్పటికీ దొరకలేదు. గంజాయితో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఏఎస్ఐ ఆర్.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మిస్టరీగా మంగళపాలెం చోరీ కేసు

కొత్తవలస, జూన్14 (ఆంధ్రజ్యోతి): మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీశ్‌బాబు ఇంట్లో గత నెల 25న జరిగిన భారీ చోరీని చేధించడం పోలీసులకు సవాల్‌గా మారింది. చోరీ జరిగి 20 రోజులు కావస్తున్నా ఇంతవరకు కేసులో ఎటువంటి పురోగతి కనిపించలేదు. మహారాష్ట్రలో ఓ నిందితుడిని అరెస్టు చేసి తీసుకువచ్చి కొత్తవలస కోర్టులో హాజరుపరిచారు. ఆ నిందితుడు ఇప్పుడు జుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. నిందితుడిని అరెస్టు చేసినా ఎటువంటి రికవరీ లేకపోవడంతో అసలు ఏం జరుగుతోందనే విషయం తెలియడం లేదు. 90 తులాల బంగారం, రూ.5 లక్షల నగదు అపహరణకు గురైందని జగదీశ్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే అంతకుమించి సొత్తు చోరీ జరిగినట్లు జగదీశ్‌బాబు సన్నిహితుల వద్ద చెప్పినట్టు సమాచారం. అయితే గురుదేవ ట్రస్ట్ చైర్మన్ జగదీశ్‌బాబుకు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో ఉన్న పరిచయాల కారణంగా పోలీసులపై ఒత్తిడి అధికంగానే ఉంది. రోజూ వందలాది మంది జగదీశ్‌బాబును పరామర్శించేందుకు వస్తున్నారు.ఇదిలా ఉండగా మహారాష్ట్రకు చెందిన ముఠా మారుమూల ప్రాంతంలోని మంగళపాలెంలోని ఇంటిని లక్ష్యంగా చేసుకోవడమేంటనే చర్చ స్థానికంగా నడుస్తోంది. స్థానికుల సహకారం లేకుండా చోరీ జరిగే అవకాశమే లేదనేది పలువురి మాట.

భూకబ్జాను అడ్డుకున్న దళితులు



ఫిర్యాదు ప్రతులతో దళితుల ప్రదర్శన

లక్కవరపుకోట, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లివీడులో సర్వే నెంబరు 255-24లో 1.26 ఎకరాల భూకబ్జాను శనివారం దళితులు అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. 40 ఏళ్ల క్రితం 1.26 ఎకరాల గెడ్డ పోరంబోకు భూమిని 12 మంది దళితులకు ప్రభుత్వం ఇచ్చింది. ఇందులో వారు పంటలు పండించుకునేందుకు వీలుగా ఎస్సీ కార్పొరేషన్ బావి మంజూరు చేసింది. అయితే ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ భూముల్లోంచి ప్రైవేట్ వ్యక్తికి లబ్ధి చేకూరేలా రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. దానిపై దళితులు ఈ నెల 2న కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ దౌర్జన్యంగా శనివారం యంత్రాలతో పనులు చేస్తుండటంతో వారిని దళితులు అడ్డగించారు. దళితులకు ఇచ్చిన భూములకు రక్షణ కరువైందని కె.రామన్న ప్రసాద్, అప్పనర్సి, రాముడు, అప్పారావు ఆందోళన వ్యక్తం చేశారు.

భోజన పథకాన్ని పక్కాగా నిర్వహించండి

రాజాం రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా నిర్వహించాలని ఎంఈవో-2 దుర్గారావు ఆదేశించారు. నిర్వహణలో తేడాలొస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శనివారం మండలంలోని వి.ఆర్.అగ్రహారంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వంటల రుచి చూశారు. అనంతరం హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ అమలు చేయాలన్నారు. ప్రభుత్వం తాజాగా సరఫరా చేసిన సన్న బియ్యంతో రుచికరంగా ఆహారాన్ని వండిపెట్టించాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గజపతినగరం, జూన్14 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దావాలపేట దరి కేతలనగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కేతల ఆంజనేయమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఇంటి ముట్టడి

● న్యాయం చేయాలని జిందాల్ నిర్వాసితుల డిమాండ్



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి

శృంగవరపుకోట రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవరలోని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు నివాసాన్ని శనివారం ఉదయం జిందాల్ నిర్వాసితులు ముట్టడించారు. ఎమ్మెల్సీ ఇంటి ముందుకు బైఠాయించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రాంతంలో జిందాల్ అల్యూమినా కర్మాగారం ఏర్పాటు చేస్తున్నారని, భూములు ఇవ్వాలని రఘురాజు కోరడంతో ఆయనపై ఉన్న నమ్మకంతో భూములు ఇచ్చామన్నారు. భూములను జిందాల్ యాజమాన్యానికి అప్పగించిన 18 ఏళ్లు కావస్తున్నా పరిశ్రమ రాలేదన్నారు. అప్పట్లో సదరు సంస్థ తమకు ఇస్తామన్న షేర్ ధనం, ఉద్యోగాల కల్పన విషయంలోనూ మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక స్థానిక ఎమ్మెల్సీతో పాటు మంత్రి కొండపల్లి, ఎంపీ భరత్, ఎమ్మెల్యే లలితకుమారిలకు వినతిపత్రాలు అందజేశామన్నారు. తాజాగా తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా భూములు చదును చేస్తుండటంపై వారు అభ్యంతరం తెలిపారు. పరిశ్రమలకు తాము వ్యతిరేకం కాదని, మాకు న్యాయం చేశాక ఇక్కడ పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈవిషయంలో తమకు న్యాయం కోసం అవసరమైతే ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. ఈ విషయంపై రఘురాజు మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెడతానన్నారు. కొంచెం ఓపిక పట్టండని కోరడం నిర్వాసితులు వెనక్కి తగ్గారు.

తాటిపూడి నీరు ఎంఎస్ఎంఈ పార్కులకు ఇవ్వొద్దు..

తాటిపూడి ఆయకట్టు రైతులు శనివారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును కలిశారు. జిందాల్ భూముల్లో ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈ పార్కులకు తాటిపూడి నీరిస్తే తమ భూములు బీడుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ విషయంపై ఎవ్వరు ఆందోళన చెందవద్దని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

చినుకు పడితే పవర్ కట్!

(ఒకటో పేజీ తరువాయి)

పాటు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 26,968 ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 1600 వరకూ రెవెన్యూ గ్రామాలు ఉండగా దాదాపు 300 మంది వరకూ మాత్రమే సిబ్బంది ఉన్నారు. వర్షాకాలం, ఈదురుగాలుల సమయంలో సిబ్బందిపడే బాధలు వర్ణనాతీతం. దీనికి తోడు దశాబ్దాలు కిందట వేసిన స్తంభాలు, విద్యుత్ లైన్లు ఎప్పటి కప్పుడు పాడవుతున్నాయి. వాటిని సరిచేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండా పోతోంది. అటు ట్రాన్స్‌ఫార్మర్లను సైతం ఏళ్లతరబడి మార్చడంలేదు. దీంతో తరచూ మొరాయిస్తున్నాయి. జిల్లా విభజనలో భాగంగా పార్వతీపురం డివిజన్ పోయినా కొత్తగా శ్రీకాకుళం జిల్లా నుంచి రాజాం డివిజన్ చేరింది.

చాలీచాలని సిబ్బంది

ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ఏడీలు 21 మంది ఉన్నారు. ఏఈలు 67 మందికిగాను 51 మంది, లైన్‌మెన్లు 172కు 152 మంది, అసిస్టెంట్ లైన్‌మెన్లు 200 మందికిగాను 140 మంది, జూనియర్ లైన్‌మెన్లు 222 మందికిగాను కేవలం 22 మంది మాత్రమే ఉన్నారు. సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు 556 మంది ఉన్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఒక్కో మండలంలో 50కు మించి రెవెన్యూ గ్రామాలు ఉంటాయి. కానీ ఉండేది నలుగురు లైన్‌మెన్లు మాత్రమే. కొత్త విద్యుత్ కనెక్షన్లు, మొండిబకాయిల వసూలు, విద్యుత్ మరమ్మతుర పనుల్లో పనిభారం ఎదుర్కొంటున్నారు.

నాన్న ఎప్పటికీ హీరోనే!

(ఒకటో పేజీ తరువాయి)

బంగారు బాట వేసేందుకు అహర్నిశలు శ్రమిస్తూ నాన్న ఎప్పుడూ ముందువరుసలో ఉంటాడు. ప్రతి కొడుకు, కుమార్తె జీవితాల్లో నిజమైన హీరో నాన్న. తండ్రిని స్ఫూర్తిగా, ప్రేరణగా ఆదర్శంగా తీసుకొని ఎంతోమంది ఉన్నతులుగా నిలిచారు. తమను తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. మన జీవితంలో మనం ఎవరికైనా రుణపడి ఉంటాం అనుకుంటే అది కచ్చితంగా తల్లిదండ్రులకు మాత్రమే. నవమాసాలు మోసేది తల్లి అయినా.. పిల్లలను జీవితాంతం గుండెల్లో పెట్టుకొని భరించే వాడు తండ్రి. నాన్న రెండు అక్షరాలే అయినా.. నిస్వార్థమైన ప్రేమకు, ఆత్మీయతకు అది ప్రతిరూపం. నాన్న అనే పిలుపులో బంధుత్వమే కాదు.. అంతకు మించిన భావోద్వేగం ఉంది.

ఎలా వచ్చిందంటే?

ప్రపంచ ఫాదర్స్ డేకు సుదీర్ఘ చరిత్ర ఉంది. దీనిని ఏటా జూన్‌లో వచ్చే మూడో ఆదివారం జరుపుకొంటారు. ముందుగా అమెరికాలో ఫాదర్స్‌డేను జరుపుకునేవారు. 1910లో జూన్ మూడో ఆదివారం నాడు అమెరికాకు చెందిన సోనోరా స్మార్ట్.. ఫాదర్స్‌డేను నిర్వహించారు. సోనోరా తండ్రి పేరు విలియం జాక్సన్ స్మార్ట్. ఆరుగురు పిల్లలకు తండ్రి. కష్టపడి పిల్లలను చదివించి ప్రయోజకులను చేశారు. తన తండ్రి కష్టాలు, బాధ్యతలను దగ్గరనుంచి చూసిన సోనోరా.. ఫాదర్స్ డే జరుపుకోవాలని నిర్ణయించింది. అక్కడి నుంచి ప్రారంభమైంది. ఫాదర్స్ డే ఆనవాయితీ. ఏటా ఈ రోజు తండ్రులను స్మరించుకుంటూ ఫాదర్స్‌డేను ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తుంటారు.

తాగునీరు సరఫరా చేయాలి

పార్వతీపురంటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరా చేయక పోతే ఊరుకునేది లేదని నాలుగో వార్డు భారత భవనం వీధికి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. గత 5 రోజులుగా కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరగకపోవడంపై ఆ వీధి మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న తమలాంటి ప్రజలకే ఇలాంటి బాధలు ఉంటే శివారులోఉన్న ప్రజలు ఇంకెన్ని బాధలు పడుతున్నారోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నాటికి తాగునీటి సరఫరా జరగకపోతే సోమవారం మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధం చేస్తామని, హెచ్చరించారు.

అనర్హులు సచివాలయంలో సంప్రదించాలి

మక్కువ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం నగదు జమకాని లబ్ధిదారులు సోమవారం సచివాలయంలో సంప్రదించాలని పంచాయతీ కార్యనిర్వహణాధికారి బెహరా శ్రీనివాసరావు కోరారు. సచివాలయంలో తల్లికి వందనం అర్హుల జాబితాను శనివారం ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం నగదు జమ చేస్తుందన్నారు. విద్యుత్ బిల్లులు అధిక మీటర్లు కలిగిన వారు సచివాలయాన్ని సంప్రదించి డీఫీడింగ్ చేసుకోవాలన్నారు. గ్రీవెన్స్‌లో సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అర్హులైన వారందరికీ వచ్చే నెల ఐదు నుంచి తల్లుల ఖాతాలో నగదు జమ అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

సాలూరు మున్సిపల్ కార్యాలయంలో పీజీఆర్ఎస్

పార్వతీపురం/సాలూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సోమవారం సాలూరులో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా సాలూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించాలని అనుకున్నామని, అనివార్య కారణాల వల్ల వేదికను సాలూరు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరానికి మార్చామని చెప్పారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

బొబ్బిలి ఐటీఐ ప్రిన్సిపాల్‌గా శ్రీధర్

బొబ్బిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా పీవీ శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా ఆచంట ఐటీఐ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రమణారావు పనిచేసిన సంగతి తెలిసిందే. శ్రీధర్ రావడంతో రమణారావు విశాఖ ఐటీఐకి వెళ్లిపోయారు.

ఇందిరమ్మకాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు

బొబ్బిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా పెట్టేందుకు పోలీసులు శనివారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో ఆకతాయిలు ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో వారి భరతం పట్టేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు.

బాలకృష్ణమ్మకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

బొబ్బిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమంలో అత్యంత కీలకపాత్రను పోషించిన దివంగత మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మకు స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాడంగి ఎంఈవో లక్ష్మణదొర, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలరామ్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

రామభద్రపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అటవీ సంపదను దోచుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోచిస్తుండడంతో వీటిని తిప్పకొట్టడానికి ఉద్యమం చేస్తున్న మావోయిస్టులను కగార్ పేరుతో అంతంచేయడం ఎంతవరకు సమంజసమని జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ ప్రశ్నించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల ఎంతోమంది అమాయకపు గిరిజనులను, మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కగార్ ఆపరేషన్‌ను నిలిపివేయాలని ఆయన డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.ఆనందరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో యోగా సందడి

- యోగాసనాలు వేసిన అధికారులు, ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది

యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా అంతటా మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం పలు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద అధికారులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



కురుపాం ఎంపీడీవో కార్యాలయంలో..



సాలూరు రూరల్: శివరాంపురంలో యోగాంధ్రలో పాల్గొన్న డీఈవో రాజ్‌కుమార్ తదితరులు



వీరఘట్టంలో..



గరుగుబిల్లి: రావుపల్లిలో..



గుమ్మలక్ష్మీపురం: యోగా చేస్తున్న అధికారులు

తల్లికి వందనంతో పండగ వాతావరణం

- మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్రంలో పండగ వాతావరణం వచ్చిందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఆమె శనివారం స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో భాగంగా రూ.13వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమ కాగా, రూ.2వేలు చొప్పున పాఠశాలల అభివృద్ధికి కలెక్టర్ల ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. తల్లికి వందనం పథకంలో రూ.2వేలు లోకేష్ అకౌంట్‌లో పడుతున్నాయని వైసీపీ నాయకులు ఫేక్ ప్రచారం చేస్తున్నారని, దమ్ముంటే నిరూపించాలని ఆమె సవాలు విసిరారు. గత ప్రభుత్వం మాదిరిగా అమ్మఒడి పథకం ద్వారా మిగిలిన రూ.2వేలు భారతీరెడ్డి హ్యాండ్‌బ్యాగ్‌లోకి వెళ్లినట్టు ఇప్పుడు జరగలేదని ఆమె అన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో సన్నబియ్యంతో రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు తెరిచిన రోజే పిల్లలకు కొత్త పుస్తకాలు, యూనిఫారాలు, బెల్టులు, బూట్లు, సాక్సులు, బ్యాగులు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు (చిట్టి), ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, గుళ్ల వేణుగోపాలనాయుడు, ఆముదాల పరమేశు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం



పాలభిషేకం చేస్తున్న దృశ్యం

వీరఘట్టం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం వీరఘట్టంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోపాటు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని విద్యార్థుల తల్లులు ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు సాసబిల్లి బుజ్జి, పప్పల మహేష్, పిన్నింటి వెంకటరమణ, గర్భాన శ్రీను పాల్గొన్నారు.

మురళీనాయక్ కుటుంబానికి ఎమ్మెల్యే సాయం

పాలకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ మురళీనాయక్ కుటుంబానికి పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ రూ.25లక్షలు సాయం అందజేశారు. సత్యసాయి జిల్లా కల్లితండాలోని మురళీనాయక్ కుటుంబ సభ్యులను ఆయన శనివారం కలిసి, ఈ చెక్కును అందించారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయపడతానని హామీనిచ్చారు. మాజీ మంత్రి పల్లె రాఘునాథ్‌రెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పశువులకు జబ్బవాపు రాకుండా టీకాలు

గరుగుబిల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పశువులకు జబ్బవాపు వ్యాధి రాకుండా ఉండేందుకు ముందస్తుగా పంచాయతీల్లో వైద్య శిబిరాలు నిర్వహించి టీకాలు వేస్తున్నామని మండల పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. కలుషితమైన ఆహారం తినడం వల్ల, కలుషిత నీరు తాగడం వల్ల ఈ వ్యాధి పశువులకు ఆశిస్తుందన్నారు. రైతులు విధిగా తమ పశువులకు టీకాలను వేయించాలని కోరారు.

నేటి నుంచి ఉత్కర్ష్ అభియాన్‌పై అవగాహన

పార్వతీపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ధర్తీ ఆబాజన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీజే జేజీయుఏ)పై జిల్లాలో ఆదివారం నుంచి అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు డీఏ జుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. గిరిజనులకు కావాల్సిన అవసరాలను గుర్తించి ధ్రువపత్రాలను జారీ చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో సేవలు, మౌలిక సదుపా యాలను కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఆధార్ ఈకేవైసీ, డాక్యుమెంటేషన్ సంబంధిత సేవల కోసం సంబంధిత విభాగాలు పనిచేస్తాయన్నారు. గ్రామస్థాయిలో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో వరి విత్తనాలు అందించాలి

పాలకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో వరి విత్తనాలు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాగు మొత్తంలో కేవలం 33 శాతం మాత్రమే వరి విత్తనాలు సరఫరా చేయడం ఆనవాయితీగా మారిందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రైతులకు కావాల్సిన వరి విత్తనాలు సరఫరా చేయడంలో పాలకులు విఫలమవుతున్నారన్నారు. పత్తి విత్తనాలను కూడా ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తుందని, ఒక్క గింజ కూడా ప్రభుత్వం సరఫరా చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం నాయకులు కిమిడి రామ్మూర్తి, బచ్చల పారినాయుడు, సన్యాసినాయుడు, గౌరునాయుడు పాల్గొన్నారు.

ఆరోరోజుకు చేరుకున్న సమ్మె

పార్వతీపురంటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ తాగునీటి సరఫరా కార్మికులు చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ కార్మిక సంఘ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు వినయ్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కోరుతున్నా కనీసం ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



శానటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

తల్లికి వందనం వర్తింపజేయాలి

సాలూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని మున్సిపల్ కార్మికుల పిల్లలకు కూడా వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై.నాయుడు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రాముడు, శంకర్, మున్సిపల్ యూనియన్ మహిళా నాయకులు, హిందు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విరివిగా రక్తదాన శిబిరాలు

బొబ్బిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అవేర్ ఫౌండేషన్ చైర్మన్ పెద్దింటి మనోజ్‌కుమార్ (బాబీ) ఆధ్వర్యంలో శనివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. 72 మంది యువకులు రక్తదానం చేశారు. స్థానిక కోవెల సెంటరులో నిర్వహించిన శిబిరంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు సందర్శించారు. ఎక్కువసార్లు రక్తదానం చేసిన జగన్‌ను ఈసందర్భంగా సత్కరించారు. బ్లడ్‌బ్యాంకు మేనేజరు పువ్వల ఈశ్వరరావు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ● రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు రక్తదాతలను క్లబ్ చైర్మన్ జేసీ రాజు తదితరులు సన్మానించారు. ● పాలకొండ: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డా.నాగభూ షణం ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వ హించారు. క్రియా ఆర్గనైజేషన్ మురళీ, జనసేనపార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యనిర్వహణ కమిటీ సభ్యు లు పొట్నూరు రమేష్, ప్రాంతీయ ఆసుపత్రి సిబ్బంది కీలకపాత్ర వహించారు. రక్తదాన శిబిరంలో మొత్తం 35 యూనిట్లు వచ్చినట్టు తెలిపారు. 43 సార్లు రక్తదా నం చేసిన క్రియా ఆర్గనైజేషన్ మురళీకృష్ణను సత్కరిం చారు. బ్లడ్ సెంటర్ వైద్యాధికారి బి.శివప్రకాష్, ఇతర వైద్యులు, ఐసీటీసీ సిబ్బంది, బ్లడ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు. ● సీతంపేట రూరల్: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక సీతంపేట ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తంగా 15 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. వైద్యాధికారులు పాల్గొన్నారు.



పాలకొండలో 43వ సారి రక్తదానం చేస్తున్న మురళీకృష్ణ

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి

బొబ్బిలి రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పొందాలనుకునే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేయాలని బొబ్బిలి ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ అన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులను గుర్తించిన తర్వాత, ప్రస్తుతం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది రైతులకు ఈకేవైసీ చేస్తున్నారని తెలిపారు. ఆధార్ లింక్ అయిన బ్యాంకుకు వెళ్లి కూడా చేసుకోవచ్చన్నారు. మండలంలో ఇప్పటి వరకూ 10,893 మందిని అర్హులుగా గుర్తించామని, వీళ్ల నుంచి బయోమెట్రిక్ విధానంలో ఈకేవైసీ చేయిస్తున్నామని చెప్పారు. ఈనెల 20వ తేదీలోగా ఎవరైతే ఈకేవైసీ చేయించుకుంటారో వారికి ఈ నెలలో వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారని తెలిపారు. ఇప్పటి వరకూ 550 మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని, మిగతా రైతులు రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి 20వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరుతున్నామని సూచించారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

బొబ్బిలి రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం బొబ్బిలి నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు జి.అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో బొబ్బిలి నియోజకవర్గం వీఆర్‌ఏ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యల పట్ల గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేస్తామని, పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని, ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ ఆ హామీలు అమలు కాలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి ఆ హామీలను అమలు చేయాలని కోరారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేదంటే జూలై 9న సమ్మె చేపడతామన్నారు. ● ఈసందర్భంగా కమిటీ కన్వీనర్లుగా జి.అప్పారావు (బొబ్బిలి), జె.సూర్యారావు (తెర్లాం), ఆర్.అప్పారావు(బాడంగి), కె.రాజారావు (రామభద్రపురం)లను ఎన్నుకున్నామని తెలిపారు. తెర్లాం సీఐటీయూ మండల నాయకులు సింగిరెడ్డి గోపాలం, బొబ్బిలి మండలం వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు పి.లక్ష్మణరావు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఆలయంలోకి మురుగునీరు



త్రినాథస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు మురుగునీరు చేరిన దృశ్యం

కురుపాం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కురుపాంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి బస్టాండ్‌లో ఉన్న త్రినాథస్వామి దేవాలయంలోకి మురుగునీరు చేరిపోయింది. గత వారం రోజులుగా ఇది రెండోసారి కావడం విశేషం. కురుపాంలో రోడ్డు, కాలువ పనులను ఇష్టారాజ్యంగా చేయడం.. అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా ఇలా జరిగినట్టు తెలుస్తోంది. దీనిపై మే 18న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైనప్పటికీ ఎవరూ స్పందించలేదు. ఇప్పటికైనా కాలువ నిర్మాణం సక్రమంగా చేపట్టి, ఆలయంలోకి నీరు వెళ్లకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

విమాన ప్రమాద మృతులకు సంతాపం

సాలూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటనలో మృతిచెందిన వారికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సంతాపం తెలిపారు. శనివారం సాలూరులోని తన క్యాంపు కార్యాలయంలో అంజలి ఘటించారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

18న ఏఎంసీ ప్రమాణస్వీకారం

సాలూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 18వ తేదీన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం తెలిపారు.

వర్షంతో ఉపశమనం

గరుగుబిల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సూర్యుని తాపంతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు సాయంత్రం వర్షంతో ఉపశమనం పొందారు.